క్లుప్తంగా

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

చీమకుర్తి రూరల్: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవోలు నరసింహారావు, శివాజి పేర్కొన్నారు. గురువారం మండలంలో పడమటి నాయుడుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవోలు సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సరైన బోధనా పద్ధతులతో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. అనంతరం 1,2 తరగతుల విద్యార్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు

మద్దిపాడు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు వాణిజ్య వ్యాపారులకు లావాదేవీలు నిర్వహించడానికి పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్లు నందిపాడు సహకార సంఘం చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సహకార సంఘం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు వాణిజ్య కార్యకలాపాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు శనగలు తదితర పంటలను రైతులు వద్ద గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. సహకార సంఘాల్లో రికార్డులను కంప్యూటరీకరణ చేస్తామన్నారు. సీఈఓ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు విరివిగా డిపాజిట్లు చేసుకుంటే అధిక వడ్డీ అందిస్తామన్నారు. ప్రతి రైతుకు సంఘం ద్వారా దీర్ఘకాలిక రుణాలు అందజేస్తామన్నారు. పాత సభ్యత్వాలు కలిగిన వారు రూ. 330 రుసుము కట్టి రూ.10 వేలు డిపాజిట్ చేసుకుంటే ఓటు హక్కు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు మహిళలకు ఉచిత వైద్య శిబిరం

కొత్తపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు కెనరా బ్యాంక్ కొత్తపట్నం శాఖ, ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని శ్రీరాం వెంకటరంగం శెట్టి కల్యాణ మండపంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కొత్తపట్నం కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ విక్రమ్ తెలిపారు. అనుభవం గల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.రాధ (ప్రసూతి, స్త్రీలు, సంతానలేమి, లాప్రోస్కోపిక్ వైద్య నిపుణులు), డాక్టర్ వి.జయవర్ధన్ (ఎండోక్రై నాలజీ వైద్య నిపుణులు), డాక్టర్ పి.ధనలక్ష్మి పాల్గొని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులు బయటపడి ఆపరేషన్ అవసరమైతే కొంత రాయితీతో చేయించనున్నట్లు చెప్పారు. కొత్తపట్నం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పేద మహిళలు వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ ప్రళయం



పర్యావరణానికి అత్యంత హాని కలిగించేది ప్లాస్టిక్. గ్రామాల్లో ఏ రోడ్డు చూసినా.. ఎక్కడ చూసినా, ఏ ఇంట్లో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కిరాణా దుకాణాలు, టీ, హోటళ్లు, బడ్డీ కొట్లు, కూరగాయల దుకాణాలు ఒకమేటి ఏ దుకాణం తీసుకున్నా ప్లాస్టిక్‌తోనే వ్యాపారాలు సాగుతున్నాయి. చీమకుర్తి పురపాలక సంఘంలో ఎటు చూసినా కనిపించే పాలిథిన్ కవర్ల వినియోగమే ఇందుకు నిదర్శనం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు హడావుడి చేసే అధికారులు ఆపై పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం షరా మామూలే అవుతోంది.

> **ప్లాస్టిక్ వదిలితేనే ఆరోగ్యం...**
> ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా విషవాయువులు శరీరంలోకి చేరుతాయి. ఫలితంగా గ్యాస్ట్రిక్, శ్వాసకోశ సమస్యలతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న ఆవులు, బర్రెలు మృత్యు వాత పడుతుండటం మనం చూస్తూనే ఉన్నాం. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా వదిలేస్తేనే ఆరోగ్యానికి మంచిది.
> – డాక్టర్ అప్సర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బండ్లమూడి

- చీమకుర్తిలో విచ్చలవిడిగా వినియోగం
- నిషేధాజ్ఞలు బేఖాతరు, కనిపించని గుడ్డ సంచులు
- 120 మైక్రాన్ల కంటే తక్కువ ప్లాస్టిక్‌తో ప్రమాదం
- నిబంధనలు కఠినం చేయాలంటున్న పర్యావరణ నిపుణులు

చీమకుర్తి రూరల్: రూ. 10 బజ్జీలు కొనుక్కున్నా సరే ఒక ప్లాస్టిక్ కవర్‌ను ఇస్తున్నారు. చివరికి ఒక కట్ట కొత్తిమీర తీసుకున్నా ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి ఇస్తున్నారు. ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు మన ఇంట్లో ప్లాస్టిక్ కవర్లు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మానవ మనుగడకు పెను ప్రమాదకారి అయిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్న నినాదాలకే అధికారులు పరిమితమవుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ నియంత్రణపై దృష్టి సారించకపోవడంతో చీమకుర్తి, మండలంలోని గ్రామాల్లో ఏ దుకాణం వద్ద చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వేడి ఆహార పదార్థాలను, ప్లాస్టిక్ కప్పుల్లో టీ, కాఫీలను తీసుకోవడం ద్వారా శ్వాసకోశ, క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలను ప్రజలు కొని తెచ్చుకుంటున్నారు. గత ఏడాది జనవరి 1 నుంచి 120 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ సంచులకే ప్రభుత్వం అనుమతులిచ్చింది. అంతకన్నా తక్కువ మందం ఉన్న సంచుల క్రయవిక్రయాలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు చేపడుతామని హెచ్చరించింది. ఈ మేరకు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అధికారులు దాడులు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకోవడం తోపాటు జరిమానాలు విధించారు.



ప్లాస్టిక్ కవర్లలో టిఫిన్ తీసుకు వెళ్తున్న వ్యక్తి

మూణ్నాళ్ల ముచ్చటగానే..

ఇదంతా మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. మూడు నెలలు తిరిగే సరికి మళ్లీ షరా మామూలే అంటూ ప్రతి షాపులోనూ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయి. మాంసం దుకాణాలు, పండ్లు, పూలు, కిరాణా, హోటళ్లల్లో ఈ కవర్ల వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాలు నీరుగారిపోతున్నాయి. ఫలితంగా కాలువలు, చెత్తకుప్పల్లో పాలిథిన్ కవర్లు పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాలను మూగజీవాలు తిని కడుపులో జీర్ణం కాక మృత్యువాత పడుతున్నాయి. రోజురోజుకు పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం యావత్ మానవాళికి ప్రమాదకరంగా మారి పెద్ద ప్రళయాన్నే సృష్టిస్తుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొస్తున్నా, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంతో అధికారులు విఫలం కావడం వారి బాధ్యతా రాహిత్యాన్ని తెలియజేస్తోంది. బాధ్యతతో నిబంధనలు పాటించాల్సిన ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఇక నైనా అందరూ కలిసి కట్టుగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం విడిచిపెట్టి, గుడ్డ సంచులు వినియోగిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

> **ప్రజలు సహకరించాలి..**
>
> 
>
> చీమకుర్తి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. ఇటీవలే మా సిబ్బంది పట్టణంలో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. ఇంకా అక్కడక్కడా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం జరుగుతోందని తెలుస్తోంది. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల అమలులో భాగంగా ప్రజలు సైతం స్వచ్ఛందంగా ప్లాస్టిక్ రహిత సంచులు విని యోగిస్తూ సహకరించాలి.
> – వై రామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్, చీమకుర్తి

యానాదులపై దాడి చేయడం హేయం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాలు

చీమకుర్తి: యానాదులపై కర్రలు, కారంపొడితో దాడిచేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు పేరం శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం చీమకుర్తి రెవెన్యూ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెల 14న బక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన యానాదులు కొమరగిరి వెంకటేశ్వరమ్మ, చలంచర్ల దుర్గ, చేపూరి సుబ్బాయమ్మపై అదే గ్రామానికి చెందిన ఇస్తాముడి సుబ్బులు, మరో ఇద్దరు మహిళలు కలిసి యానాదుల ఇళ్లపైకి వచ్చి కారంపొడిని కళ్లల్లో కొట్టి కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని రాష్ట్ర ఎరుకుల హక్కుల పోరాటసమితి అధ్యక్షులు ఎస్ ఎం ధర్మ, కేఎస్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకట్రావు తెలిపారు. వారితో పాటు గిరిజన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పేరం సత్యం, ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ తొరటి ఆనంద్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి బీ.రఘురామ్ మాట్లాడుతూ యానాదులపై దాడి చేయటమే కాకుండా కులం పేరుతో దూషిస్తూ గ్రామం వదిలిపెట్టి పోవాలని భయభ్రాంతులకు గురిచేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దాడిచేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినా ఇంతవరకు వారిని అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. యానాదులను రాజీకోసం వచ్చేవిధంగా చేసే కార్యక్రమంలో భాగంగా దాడిచేసిన మహిళల ఫిర్యాదుతో కౌంటర్ కేసు పెట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యానాదులపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేసి దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహీసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ధర్నా కార్యక్రమంలో కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, పలు ప్రజాసంఘాల నాయకులు రావినూతల కోటి, పాలడుగు విజేంద్ర బహుజన్, జంగాల కోటేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.

ఇంద్ర బస్సుకు గుంటూరులో స్టాప్

ఒంగోలు టౌన్: గత నెల 24వ తేదీ నుంచి ఒంగోలు నుంచి విజయవాడకు ఇంద్ర ఏసీ నాన్ స్టాప్ బస్సు నడుపుతున్న విషయం తెలిసిందే. అయితే, అనుకున్నంత ఆదరణ లేకపోవడంతో పాటు గుంటూరు, అమరావతి ఉద్యోగులు, హైకోర్టుకు హాజరయ్యే న్యాయవాదులు గుంటూరు స్టేజీ కావాలని అడుగుతున్న నేపథ్యంలో ఈ నెల 1 నుంచి గుంటూరులో స్టాప్ కల్పించినట్లు డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో గౌరీఉమామహేశ్వరి



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: యజ్ఞగిరి నరసింహస్వామి పీఠం ఆధ్వర్యంలో స్థానిక త్రోవగుంటలో శ్రీగౌరీ ఉమా మహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఆలయ ప్రధాన అర్చకుడు పవన్‌శర్మ, అర్చకులు సతీష్‌శర్మ గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, కంకణధారణ, గణపతి హోమం, మహా సుదర్శన హోమం, విగ్రహాలకు అభిషేకం, మూలమంత్ర జపాలు, అతివాస హోమం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, పుష్పాధివాసం, నివేదన మంగళహారతులు, పంచామృతాభిషేకం, కూష్మాండ బలి, అష్టదిగ్బాలక బలి, యంత్రస్థాపన, విగ్రహ స్థాపన, ప్రతిష్ఠ, పూర్ణాహుతి, నేత్రమేళనం, ప్రాణ ప్రతిష్ఠ, కలశ ఉద్వాసన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు సామూహికంగా పాల్గొన్న మహిళా భక్తులచే కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థికసాయం



వెంకాయమ్మకు నగదు అందజేస్తున్న ఎస్సై సుధాకర్‌బాబు

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల గ్రామానికి చెందిన పేద వృద్ధురాలు వేమా వెంకాయమ్మకు కొత్తపట్నం ఎస్సై వి.సుధాకర్‌బాబు గురువారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆమె భర్త వేమా అంకయ్య ఆరోగ్యం బాగాలేక, కుటుంబ ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేని కారణంగా ఈ నెల 3వ తేదీ పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఈ నెల 5వ తేదీ మృతి చెందాడు. వెంకాయమ్మకు కాలు విరిగి మంచంలో ఉంది. భర్త మృతి చెందడం, తన ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పూట గడవక దిగాలు చెందుతున్న నేపథ్యంలో స్థానిక ఎస్సై సుధాకర్‌బాబు స్పందించి ఆర్థికసాయం అందజేశారు.

9న కబడ్డీ జిల్లా సబ్ జూనియర్ జట్టు ఎంపిక

ఒంగోలు: కబడ్డీ జిల్లా సబ్ జూనియర్ జట్టును ఈ నెల 9వ తేదీ స్థానిక మినీ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, వై.పూర్ణచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఎంపికకు హాజరుకాదలచుకున్న బాలబాలికల బరువు 55 కేజీల్లోపు ఉండాలన్నారు. 2009 మార్చి 30వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడా జట్లు త్వరలో డాక్టర్ వైఎస్సార్ జిల్లా పులివెందులలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందని వెల్లడించారు.

మహిళలకు ఆటల పోటీలు





వివిధ పోటీల్లో ప్రతిభ చూపుతున్న మహిళా ఉద్యోగులు



ఒంగోలు సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం రెండోరోజు మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక ఎన్‌జీవో హోంలో పాటలు, స్కిప్పింగ్ పోటీలు, ఓల్డ్ రిమ్స్‌లో టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్స్ ఫైనల్స్ నిర్వహించారు. పాటల పోటీలను జిల్లా మహిళా విభాగం చైర్మన్ కె.కోటేశ్వరమ్మ, కన్వీనర్ సీహెచ్ శిరీష, జిల్లా కో చైర్మన్ భారతి, ఒంగోలు చైర్మన్ జ్యోతి, ఎస్.డి.షమ్మి, సునీలాకుమారి తదితరులు నిర్వహించారు. స్కిప్పింగ్ పోటీలకు మహిళా విభాగం నాయకులు ఐ.అరుణ ప్రణతి, ఎస్.గాలెమ్మ, కె.రాజేశ్వరి నిర్వాహకులుగా వ్యవహరించారు. టెన్నికాయిట్ ఆటల పోటీలను డి.జయమ్మ, ఎస్.స్వర్ణలత, జిల్లా కోశాధికారి కె.శివకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి బి.ఏడుకొండలు నిర్వహించారు. ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి పర్యవేక్షించగా, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి మంజేష్, కార్యదర్శి షేక్ మగ్దుమ్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షులు బి.కృష్ణకిషోర్, రామాంజనేయులు, జిల్లా సంయుక్త కార్యదర్శులు ప్రసన్నాంజనేయరాజు, కిరణ్, విజయ్, మహిళా విభాగం నాయకులు రత్నరాణి, నారాయణమ్మ, అంజనాదేవి, కృష్ణవేణి, కవిత, తులసి, మల్లిక తదితరులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎన్‌జీవో హోంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సభలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

10న నరసరావుపేటలో రాష్ట్ర సదస్సు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

చీమకుర్తి: సావిత్రిబాయి పూలే వర్ధంతి రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండని కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకట్రావు పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తిలో రాష్ట్రసదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 10న నరసరావుపేటలో కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి అందరు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో జంగాల కోటేశ్వరరావు, కేఎన్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల నిర్మాణాలు పూర్తి చేయాలి



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇంజినీర్ చెన్నారాయుడు

చీమకుర్తి రూరల్: లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే త్వరగా బిల్లులు అందుతాయని హౌసింగ్ డిప్యూటీ ఇంజినీర్ చెన్నారాయుడు పేర్కొన్నారు. గురువారం మండలంలో మంచికలపాడు సచివాలయ పరిధిలో చీమలమర్రి జగనన్న కాలనీ లే అవుట్‌ను ఆయన సందర్శించాడు. కార్యక్రమంలో హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ గిరి ప్రకాశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు

ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.5 లక్షలకు టోపీ

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన ఒక వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.5 లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... స్థానికుడు శ్రీకాంత్ కొన్ని రోజుల క్రితం సింహాచలం టూర్‌కు వెళ్లాడు. అక్కడ కారు డ్రైవర్ శంకర్‌తో పరిచయమైంది. మాటల మధ్యలో డిగ్రీ చదువుకున్న తన భార్య ఇంటివద్ద ఖాళీగా ఉంటుందని కారు డ్రైవర్ చెప్పాడు. దాంతో ఆమెకు ఉద్యోగం ఇప్పిస్తానంటూ శ్రీకాంత్ వారి వద్ద నుంచి విడతలవారీగా మొత్తం రూ.5 లక్షల వరకు వసూలు చేశాడు. చివరికి ఉద్యోగం రాకపోవడంతో మోసపోయినట్లు గమనించి గురువారం ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సీఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.